

# గులి రాగి సాగులో రారాజు 'ధర్మరాజు'

ప్రతికూల వాతావరణంలోనూ రైతు సేఫ్...

రెండు నుంచి 8 బస్తాలకు పెరిగిన దిగుబడి

రైతాంగానికి అనుకూలంగా విధానం

తక్కువ పెట్టుబడితో ఐదింతలు పెరిగిన రాబడి

**"వాతావరణం అనుకూలంగా ఉంటే ఎవరైనా మేలైన దిగుబడులు సాధించడం పెద్ద విశేషం కాదు.. దీనికి భిన్నంగా ప్రతికూల పరిస్థితులను తట్టుకుని ఐదింతల ఆదాయం సాధించేందుకు దోహదపడుతోంది ప్రకృతి వ్యవసాయం.. దీనికి కొన్ని సాగు పద్ధతులను అనుసంధానం చేసి, తిరుగులేదని నిరూపిస్తున్నారు ఆదివాసీ రైతులు... కేవలం తక్కువ పెట్టుబడితో సేద్యంలో నూతన విధానాలను అనుసరించడం ద్వారా ఇది సాధ్యమవుతోంది.. వీటిని అందిపుచ్చుకుంటున్నారు రంగశిల రైతులు ఏటా లాభాల బాటలో పయనిస్తున్నారు.. దానికి ఆర్‌వైఎస్ఎస్, వాసన్ సంస్థలు అవసరమైన సహకారం అందిస్తుండటంతో ఇక్కడి గిరిరైతులు మరింత అభివృద్ధి చెందే దిశగా అడుగులు వేస్తున్నారు."**

అల్లూరి సీతారామరాజు జిల్లా, హుకుంపేట మండలం, రంగశిల క్లస్టరు, అదే గ్రామానికి చెందిన రైతు కిల్లో దర్మరాజు... తనకు భార్య, ఇద్దరు పిల్లలు. కొటియా తెగకు చెందిన ఆయనకు 10.79 ఎకరాల భూమి ఉంది. తను అందిరిలాగే తన పిల్లలను చదివించాలని అనుకున్నా, వారు దీనికి భిన్నంగా వ్యవహరించారు. దీంతో వారు తనకు సేద్యంలో సాయంగా ఉంటున్నారు. తను ఏడేళ్ల క్రితం వరకు అన్ని పంటలు సాధారణ పద్ధతిలోనే సాగు చేసేవాడు. దీనిలో భాగంగానే రాగి పంటను ఇదే విధానాన్ని అనుసరించేవాడు. భూమి దుక్కి చేసిన తరువాత పశువుల గెత్తం వేసి పంట సాగు చేయడం, తరువాత రెండు, మూడు దఫాలు కలుపు తీసి అలానే వదిలేసేవాడు. అలా చేయడం వల్ల ఎకరాకు బస్తాన్నర నుంచి రెండు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చేవి. ఎంత కష్టపడినా అదే పరిస్థితి ఉండేది. కనీసం కూలీ



ఖర్చులు వచ్చేవి కావు. సాగు విధానం మారిస్తేనే కష్టానికి తగిన ఫలితం వస్తుందని నిర్ణయించుకున్నాడు. దీనికి అనుగుణంగా ఆరేళ్ల క్రితం తిరుపతిలో జరుగుతున్న పాలేకర్ సమావేశానికి వెళ్లి, ప్రకృతి సాగు ప్రాధాన్యతను తెలుసుకున్నాడు. దీనిపై మక్కువ పెంచుకున్న ధర్మరాజు అప్పటికే ప్రకృతి విధానంలో సాగు చేస్తున్న బూదుగుపుట్టు గ్రామ రైతు మహాదేవ్ పంటను పరిశీలించి, అప్పట్నుంచి అదే విధానాన్ని అనుసరిస్తూ వస్తున్నాడు. దీనిలో భాగంగా ఏటా ఈ విధానంలో వరి, రాగి, సామలు, కూరగాయలు సాగు చేసేవాడు. ప్రధానంగా కూరగాయల సాగులో అధిక ఆదాయం సాధించేవాడు. ఇదే మాదిరి చిరుధాన్యాల సాగులో అధిక వృద్ధిని సాధించేందుకు 2021 ఖరీఫ్‌లో శ్రీ విధానాన్ని అనుసరించాడు.

దీనిలో భాగంగా ముందుగా 4 కిలోల బెల్లం, 4 కిలోల సెనగపిండి, ఆవు పేడ, మూత్రంతో సుమారుగా 400ల కిలోల వరకు ఘన జీవామృతాన్ని సిద్ధం చేసుకున్నాడు. దీనికి రూ. 400లు ఖర్చయ్యింది. తరువాత రూ. 50ల విలువజేసే తన వద్ద ఉన్న దేశీయ విత్తనాలను కిలో తీసుకుని సాగుకు సిద్ధమయ్యాడు. గత ఏడాది సాగు చేసిన భూమిని వదిలి వేరే చోట ఎకరం విస్తీర్ణంలో ఘన జీవామృతాన్ని వేసి రూ. 800ల ఖర్చుతో రెండు దఫాలుగా కలియ దున్నించాడు. ఇలా సిద్ధం చేసిన భూమిలో బెడ్‌లా తయారు చేసి దానిపై విత్తనాలను చల్లించాడు. పదిహేను రోజుల తరువాత ఎదిగిన లేత నారును పొడవు, వెడల్పులు ఎటు చూసినా అడుగు దూరం వచ్చే విధంగా కూలీలకు రూ. 600లు చెల్లించి, నాట్లు వేయించాడు. ఇది పూర్తయిన నెల రోజులకు పంటలో కలుపు రావడంతో 15, 30 రోజులకు వీడర్ సాయంతో తనే స్వయంగా శుభ్రం చేసుకున్నాడు. తరువాత ఎద్దులతో మరోసారి కలుపును శుభ్రం చేయించాడు. వీటికి రూ. 600లు ఖర్చయ్యాయి. దీని తరువాత రూ. 200ల ఖర్చుతో 2 కిలోల బెల్లం, 2 కిలోల సెనగపిండి, ఆవు పేడ, మూత్రంతో తయారు చేసిన ద్రవ జీవామృతాన్ని పంటపై తనే స్వయంగా పిచికారీ చేసుకున్నాడు. మొదటి కలుపు తీశాక సంస్థ ప్రతినిధులు చెప్పినట్టు మొక్కలపై నుంచి తేలికపాటి కలప దుంగను తాడు సాయంతో తూర్పు నుంచి పడమరకు మరలా వెనుకకు, ఉత్తరం నుంచి దక్షిణానికి



మరలా వెనుకకు ఇలా 15 నుంచి 45 రోజుల మధ్యలో మూడు దఫాలుగా తనే స్వయంగా దుంగ లాగాడు. ఇలా లాగడం వల్ల మొక్కవేర్లు, కాండం కలిసే చోట మొక్కలు వంగి, వాటిలోని విభజన కణజాలం ప్రేరణపొంది అధిక పిలకలు వచ్చాయి. ఈ పనులు పూర్తయి 15 రోజులు గడిచాక రైతు ధర్మరాజు తన పొలంలో పిలకలు చూసి ఆశ్చర్యపోయాడు. గతంలో ఎక్కడా చూడని విధంగా 40 నుంచి 42 పిలకలు వరకు వచ్చాయని గుర్తించాడు. వీటితో పాటే పంటలో కంకులు ఎక్కువగా కనిపించాయి. ఇలా పిలకలు, కంకులు ఎక్కువగా కనిపించేసరికి దిగుబడి ఎక్కువగా వస్తుందని అంచనా వేసుకున్నాడు. పంటకాలం పూర్తయిన తర్వాత రూ. 1,200ల ఖర్చుతో కోత కోయించి, నూర్పు చేయించాడు. అన్నీ పూర్తయ్యాక చూస్తే ఎనిమిది బస్తాల దిగుబడి వచ్చింది. వీటికి రూ.21,120లు రాగా, పెట్టుబడి ఖర్చులు రూ. 3,800లు పోను నికర ఆదాయం రూ. 17,320లు మిగిలింది. ఇదే పంట సాధారణ పద్ధతిలో సాగు చేసినప్పుడు దిగుబడి కేవలం రెండు బస్తాలకే పరిమితం కాగా, శ్రీ విధానాన్ని అనుసరించడం వల్ల మూడు రెట్ల దిగుబడి పెరిగింది. కేవలం సాగు విధానాన్ని మార్చి అధిక దిగుబడి సాధించిన ధర్మరాజును చుట్టుపక్కల రైతులు గులి రాగి సాగులో రారాజు అంటూ కితాబునిచ్చారు... గతంలో ఎన్నడూలేని విధంగా ప్రకృతి విధానంలో గులిరాగి సాగు చేయడం వల్ల అధిక ఆదాయం రావడంతో భవిష్యత్తులో వీటిని మరింత విస్తరించేందుకు నిర్ణయించుకున్నాడు.

**యువరైతు గెమ్మిలి కిరణ్‌కుమార్...తను చిన్నతనం నుంచే చురుకైన వాడు.. చదువులో రాణించేవాడు.. అందుకే భవిషత్తును ఎంతో ఊహించుకున్నాడు... ఉన్నతంగా చదువుకోవాలని.. మంచి ఉద్యోగం సాధించాలని.. అయితే తల్లిదండ్రుల అనారోగ్యం కిరణ్ ఊహలకు కళ్లెం వేసింది.. మధ్యలోనే స్వస్తి చెప్పి, చదువులో పాస్ కాకుండా చేసింది... అయితేనేం.. సాగులో పాస్ అయ్యాడు.. ప్రకృతి పద్ధతిలో గులిరాగి చేపట్టి, రెండు బస్తాల నుంచి ఏకంగా పది బస్తాలకు దిగుబడి సాధించాడు.. శభాష్ అనిపించుకున్నాడు..**



# గులిరాగి సేద్యంలో విజేత..

**చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పిన కిరణ్‌కుమార్**

**తల్లిదండ్రుల అనారోగ్యమే ప్రధాన కారణం**

**వ్యవసాయంలో నాగలి చేతపట్టిన యువరైతు**

**ఆదుకున్న ప్రకృతి విధానంలో పంటల సాగు**

అల్లూరి సీతారామరాజు జిల్లా, దుంబ్రిగుడ మండలం, సొవ్వ క్లస్టరు, గొప్పులవలస గ్రామానికి చెందిన రైతు గెమ్మిలి కిరణ్‌కుమార్. తనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు. కొండదొర తెగకు చెందిన తను ఉన్నత విద్యాభ్యాసం చేయాలని లక్ష్యంగా చేసుకున్నాడు. అయితే తల్లిదండ్రుల అనారోగ్య కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటర్ తోనే చదువుకు స్వస్తి చెప్పాల్సి వచ్చింది. తన పిల్లలను తనలా కాకుండా, పూర్తిస్థాయిలో చదివించాలని నిర్ణయించుకున్నాడు. అయితే తన పిల్లల విషయమై మంచి లక్ష్యం నిర్దేశించుకున్నా... క్షేత్రస్థాయిలో దానికి అనుకూలమైన పరిస్థితుల్లేవు. తనకు రెండున్నర ఎకరాలు మాత్రమే భూమి ఉంది. ఎన్నో ఏళ్ల తరబడి ఆచరిస్తున్న సాధారణ పద్ధతుల వల్ల సాగు అంత ఆశాజనకంగా లేదు. దీంతో వీటి నుంచి వచ్చే ఆదాయం అంతంతమాత్రంగానే ఉండేది. అయినా వేరే ప్రత్యామ్నాయం లేక ఇదే పద్ధతిని కొనసాగించక తప్పలేదు. ఈ క్రమంలో 2020 ఖరీఫ్‌లో అర ఎకరం సెంట్ల విస్తీర్ణంలో రాగి పంటను సాగు చేశాడు. రూ. 400ల ఖర్చుతో పంట భూమిని దుక్కి చేయించాడు. ఇదే దుక్కిలో 1,000ల పశువుల గెత్తాన్ని వేయించాడు. తరువాత రూ. 200ల ఖర్చుతో పది కిలోల రాగి విత్తనాలను తీసుకుని, దుక్కి చేసిన భూమిలో ఒక పక్కగా నారు పోశాడు. నారు ఎదిగాక రూ. 1,200ల ఖర్చుతో దగ్గరదగ్గరగా నాట్లు వేయించాడు. ఆ తరువాత 20 రోజులకు పంటలో కలుపు రావడంతో నలుగురు కూలీలతో శుభ్రం చేయించాడు. దీనికి రూ. 800లు ఖర్చయ్యాయి. మరో నెల రోజులు గడిచాక చూస్తే మరో దఫా కలుపు వచ్చింది. మరలా నలుగురు కూలీలకు రూ. 800లు చెల్లించి, పంటను శుభ్రం చేయించాడు. ఈ విధంగా మరో నెల



గడిచేసరికి ఒక్కో దుబ్బుకు కేవలం నాలుగు నుంచి ఆరు వరకు పిలకలు వచ్చాయి. పంట కాలం పూర్తయ్యాక ఐదుగురు కూలీలకు రూ. 1,200లు చెల్లించి కోత కోయించి, రూ. 400లతో నూర్పు చేయించాడు. అన్ని పనులు పూర్తయ్యాక దిగుబడి కేవలం రెండు బస్తాలు మాత్రమే వచ్చింది. వీటి మార్కెట్ విలువ రూ. 4,000ల వరకు ఉంటుంది. పెట్టుబడి రూ. 6,000లు పోను నికర ఆదాయం చూస్తే రూ. 2వేలు నష్టం వచ్చింది. ఈ విధంగా పంటకు అవసరమైనంత పెట్టుబడి పెట్టి, కుటుంబ సభ్యులంతా కష్టపడినా ఆశించినట్టు ఆదాయం రాకపోవడంతో కిరణ్‌కుమార్‌కు బెంగ పట్టుకుంది. ఏటా ఇదే పరిస్థితి ఉంటే తన పిల్లల చదువు పరిస్థితి ఏంటనే ఆందోళన పెరిగింది. ఇలా అయితే కష్టమని భావించి, ప్రత్యామ్నాయ విధానంవైపు ఆలోచన చేశాడు. అదే సమయంలో రైతు సాధికార సంస్థ, వాసన్ సంస్థ ప్రతినిధులు సొవ్వ క్లస్టరుగా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన చేస్తుండగా విని, అదే విధానంలో సాగు చేసేందుకు నిర్ణయించుకున్నాడు. సంస్థ ప్రతినిధులు చెప్పినట్టు గత ఏడాది ఖరీఫ్‌లో వరి మాదిరిగానే రాగి పంటను శ్రీ పద్ధతిలో సాగు చేసేలా ఏర్పాట్లు చేసుకున్నాడు.

ముందుగా 4 కిలోల బెల్లం, 4 కిలోల సెనగపిండి, ఆవు పేడ, మూత్రం కలిపి సుమారుగా వెయ్యి కిలోల వరకు టైప్ 2 ఘన జీవామృతాన్ని సిద్ధం చేసుకున్నాడు. దీనికి రూ. 400లు ఖర్చయ్యింది. తరువాత రూ. 20ల విలువజేసే దేశీయ విత్తనాలను కిలో తీసుకుని సాగుకు సిద్ధమయ్యాడు. గతంలో సాగు చేసిన అర ఎకరం విస్తీర్ణంలో టైప్ 2 ఘన జీవామృతాన్ని వేసి రూ. 400ల ఖర్చుతో దుక్కి చేయించాడు. ఇలా సిద్ధం చేసిన భూమిలో బెడ్‌లా తయారు చేసి దానిపై విత్తనాలను చల్లించాడు. పదిహేను రోజుల తరువాత ఎదిగిన లేత నారును పొడవు, వెడల్పులు ఎటు చూసినా అడుగు దూరం వచ్చే విధంగా కూలీలకు రూ. 1,600లు చెల్లించి, నాట్లు వేయించాడు. ఇది పూర్తయిన తరువాత పంటలో కలుపు రావడంతో 15, 30 రోజులకు సైకిల్ వీడర్ సాయంతో తనే స్వయంగా శుభ్రం చేసుకున్నాడు. కలుపు పనులు పూర్తయిన తరువాత రూ. 100ల ఖర్చుతో కిలో బెల్లం, కిలో సెనగపిండి, ఆవు పేడ, మూత్రం, పుట్టమట్టితో తయారు చేసిన ద్రవ జీవామృతాన్ని పంటపై తనే స్వయంగా రెండు దఫాలుగా పిచికారీ చేసుకున్నాడు. మొదటి కలుపు తీశాక సంస్థ ప్రతినిధులు చెప్పినట్టు మొక్కలపై నుంచి తేలికపాటి కలప దుంగను తాడు సాయంతో తూర్పు నుంచి పడమరకు మరలా వెనుకకు, ఉత్తరం నుంచి దక్షిణానికి మరలా వెనుకకు ఇలా 15 నుంచి 45 రోజుల మధ్యలో మూడు దఫాలుగా తనే స్వయంగా దుంగ లాగాడు. వీటి వల్ల మొక్కవేర్లు, కాండం కలిసే చోట మొక్కలు వంగి, వాటి లోని విభజన కణజాలం ప్రేరణపొంది అధిక పిలకలు వచ్చాయి. ఈ పనులు పూర్తయి 15 రోజులు గడిచాక రైతు కిరణ్ కుమార్ తన పొలంలో పిలకలు చూసి ఆశ్చర్యపోయాడు. గతంలో ఒక్కో దుబ్బుకు నాలుగు నుంచి ఆరు పిలకలు రాగా, దుంగ లాగడం వల్ల ఏకంగా 50 నుంచి 70 వరకు పిలకలు రావడం గమనించాడు. వీటితో పాటే పంటలో పెద్ద సైజులో వెన్నులు వచ్చాయి. అదేవిధంగా గింజలు బలంగా కనిపించాయి. పంటకాలం పూర్తయిన తర్వాత రూ. 1,600ల ఖర్చుతో కోత కోయించి, నూర్పు చేయించాడు. అన్నీ పూర్తయ్యాక చూసే 8 బస్తాల దిగుబడి వచ్చింది. వీటికి రూ.16,000లు రాగా, పెట్టుబడి ఖర్చులు రూ. 4,120లు కాగా, నికర ఆదాయం 11,880లు మిగిలింది. గతంలో ఎన్నడూలేని విధంగా ఆదాయం సమకూరడంతో కిరణ్‌కుమార్‌కు ధైర్యం వచ్చింది. పిల్లల్ని చదివించేందుకు ఈ విధానం దోహదం చేస్తుందని నమ్మాడు. ఇక భవిష్యత్తులో పంటలన్నీ ప్రకృతి విధానంలోనే సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. తన జీవితంలో ఉన్నత విద్యను అభ్యసించాలనే క్రమంలో ఫెయిల్ అయినా ప్రకృతి పద్ధతిలో చేపట్టిన గులి రాగి సాగులో పాసై విజేతగా నిలిచాడు.





“ఏజెన్సీలో నాలుగైదేళ్లుగా ప్రకృతి విధానాలను ఆచరిస్తున్న ఆదివాసీ రైతాంగం మరో పద్ధతి వైపు దృష్టిసారిస్తున్నారు. సంవత్సరమంతా భూమిని కప్పిఉంచేలా పలు పంటల సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. రుతుపవనాలకు ముందు ప్రారంభించి, ఏడాది పాటు సాగు చేసే పీఎండీఎస్ విధానాన్ని అందిపుచ్చుకుంటున్నారు... రైతు సాధికార సంస్థ, వాసన్ సంస్థల సలహాలతో పాటు ఈ విధానాన్ని ఆచరించి, లబ్ధిపొందిన రైతుల అనుభవాలు తీసుకుని, మరింత మెరుగైన ప్రయోజనం పొందేలా ప్రణాళికలు చేస్తున్నారు... ఈ పద్ధతి నేరుగా రైతులకు లబ్ధి చేకూర్చడమే కాకుండా, భవిషత్తు తరాలకు సారవంతమైన భూమిని అందించేందుకు దోహదం చేస్తోంది.. మన్యంలోని అన్ని గ్రామాల్లో ఈ విధానాన్ని ఆచరించేందుకు చర్యలు తీసుకుంటున్న సంస్థలు దానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో తమ వంతు కృషి చేస్తున్నాయి..”

# పీఎండీఎస్‌పై పెరుగుతున్న ఆసక్తి

- గిరిజన ప్రాంతాల్లో విస్తరిస్తున్న పద్ధతి
- ఏడాది పాటు నేల కప్పిఉంచేలా పంటలు
- పోషకాలు పెరిగి, సారవంతం కానున్న భూమి
- తక్కువ పెట్టుబడితో రానున్న నాణ్యమైన దిగుబడి

అల్లూరి సీతారామరాజు జిల్లా, దుంబ్రిగుడ మండలం, సొవ్వ క్లస్టరు, గొప్పులవలసకు చెందిన రైతు గెమ్మిలి నాగేశ్వరావుకు భార్యతో పాటు పాప ఉన్నారు. తనకు మూడెకరాల భూమి ఉంది. తను 2018 నుంచి ప్రకృతి విధానంలో వివిధ పంటలు సాగు చేస్తున్నాడు. ఈ భూమిలో ఏటా వర్షాల సమయంలో వివిధ రకాలైన పంటలు సాగు చేయడం పక్కానికి వచ్చిన తరువాత పంట తీసి, మిగిలిన రోజులు ఖాళీగా వదిలేసేవాడు. దీనివల్ల భూమిపై నేరుగా ఎండపడి, దానిలోని సూక్ష్మపోషకాలు తగ్గి, నిస్సారంగా మారుతున్నాయి. ఈ ప్రభావం పంట దిగుబడులపైనా పడుతుంది. ఈ విషయాలను గుర్తించిన ఆర్‌వైఎస్ఎస్, వాసన్ సంస్థలు మేలో వచ్చే రుతుపవనాలకు ముందు సాగు ప్రారంభించి, ఏడాది పాటు పంటలు



పండించే పీఎండీఎస్ విధానాన్ని రైతులకు పరిచయం చేశారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఈ విధానంలో సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నారు.

ఈ విధానాలను అందిపుచ్చుకున్న రైతు నాగేశ్వరరావు తనకున్న ఎకరం విస్తీర్ణంలో పీఎండీఎస్ పద్ధతిలో వివిధ పంటలు సాగు చేసేందుకు నిర్ణయించుకుని 2021లో ఆ దిశగా అడుగులు వేశాడు. ముందుగా రూ. 200ల ఖర్చుతో రెండు కిలోల బెల్లం, రెండు కిలోల సెనగపిండి, పశువుల పేడ, మూత్రం, పుట్టమట్టిని తీసుకుని 200ల కిలోల ఘన జీవామృతం సిద్ధం చేసుకున్నాడు. తను సాగు చేసేందుకు నిర్ణయించిన ఎకరం భూమిలో దీనిని చల్లి, 1,200ల ఖర్చుతో రెండు దఫాలుగా దుక్కి చేయించాడు. తరువాత సాగు చేసేందుకు నిర్ణయించిన ఆముదం, కందులు, ముల్లంగి, నాగదుంప, మునగ, గోంగూర, గోరుచిక్కుడు, మొక్కజొన్న, కాకిజొన్న, ఆవాలు, దోస, వంకాయ, జుట్టుపిక్కలు, తీయదుంప, అరటి విత్తనాలను సమకూర్చుకున్నాడు. వీటికి రూ. 2,400లు ఖర్చయ్యింది. మార్చిలో ప్రారంభమైన వర్షాలకు దుక్కి చేసిన రైతు ఏప్రిల్‌లో విత్తనాలను నాటుకున్నాడు. ఏజెన్సీలో సాధారణంగా ఏప్రిల్‌లో కురిసే వర్షాలు ఈ పంటకు కలిసి వచ్చాయి. కలుపు వచ్చినా భార్య, భర్తలు కలిసి తీసి, పంటలోనే వదిలేసేవారు. తరువాత రూ. 200ల ఖర్చుతో రెండు కిలోల బెల్లం, రెండు కిలోల సెనగపిండి, ఆవుపేడ, మూత్రం, పుట్టమట్టితో కలిపి రెండు వందల లీటర్ల వరకు ద్రవ జీవామృతాన్ని సిద్ధం చేసుకున్నాడు. దీనిని వర్షాలు లేని సమయం చూసి పంటపై పిచికారీ చేసేవాడు. ఈ విధంగా సాగు చేసిన పంటలో జూన్‌లో మొదటిగా గోంగూర దిగుబడి వచ్చింది. వీటిని తన ఇంటి ఖర్చుకు వాడుకుని మిగిలిన దానిని అమ్మకం చేయగా రూ. 200లు వచ్చింది. జూలైలో వంకాయ, గోరు చిక్కుడు దిగుబడి వచ్చింది. వీటిని ఇంటి ఖర్చుకు వినియోగించుకోగా, అదనంగా వచ్చిన ఉత్పత్తులను రూ. 2,100లకు అమ్మకం చేశారు. ఆకుకూర, కాయకూరలు పూర్తిగా తొలగించిన తరువాత వాటి స్థానే మరలా గోంగూర, తోటకూర, వంకాయ, పచ్చిమిర్చి విత్తనాలను నాటుకున్నాడు. సెప్టెంబరు నెలలో మరలా తోటకూర, ఆకుకూర, ముల్లంగి, దోస దిగుబడి వచ్చింది. వీటిలో ఇంటి ఖర్చుకు పోగా, మిగిలిన వాటిని అమ్మకం చేయగా రూ. 3,900లు వచ్చింది. అక్టోబరు నెలలో నాగదుంప, మొక్కజొన్న, బీన్సీస్ దిగుబడి వచ్చాయి. వీటిని తన ఇంటి ఖర్చుకు వినియోగించుకోగా, మిగిలిన వాటిని రూ. 5,900లకు అమ్మకం చేశాడు. నవంబరు నెలలో మరలా కూరగాయలు వంకాయ, పచ్చిమిర్చి, గోంగూర దిగుబడి వచ్చాయి. వీటిలో చాలావరకు ఇంటి ఖర్చుకు వినియోగించుకుని, మిగిలిన వాటిని అమ్మకం చేయగా రూ. 3,400లు వచ్చింది. ఈ విధంగా ఖాళీ అయిన భూమిలో తోటకూర, గోంగూర, కొత్తిమిర, ముల్లంగి సాగు చేశాడు. డిశెంబరులో మునక్కాయ, కాకిజొన్న, ఆవాలు, జుట్టుపిక్కలు, తీయదుంప దిగుబడి వచ్చాయి. వీటిని కొంతమేర ఇంటి ఖర్చుకు వినియోగించుకుని, మిగిలిన వాటిని అమ్మకం చేయగా రూ. 5, 820లు ఆదాయం వచ్చింది. జనవరి నెలలో ఆముదం, కందులు, అరటితో పాటు తోటకూర, గోంగూర, కొత్తిమిర, ముల్లంగి దిగుబడులొచ్చాయి. వీటిలో అధికశాతం ఇంటి ఖర్చుకే వాడుకున్నారు. ఆముదం, కందులను మాత్రం అమ్మకం చేశాడు. వీటి నుంచి 2,640లు రాబడి వచ్చింది. ఫిబ్రవరి నెల వరకు మిగిలిన పంటలకు సంబంధించిన ఉత్పత్తులు వస్తూనే ఉన్నాయి. అయితే ప్రతి నెలా పంట తీసిన ప్రతిసారీ అవసరమైన చోట రైతు నాగేశ్వరావు ద్రవ జీవామృతాన్ని పిచికారీ చేసేవాడు. ఈ విధానం వల్ల ప్రతి నెలా ఆదాయం రావడంతో రైతు సంతోషించాడు. ఫిబ్రవరి చివరకు అన్ని పంటలు పూర్తయ్యాయి. మార్చిలో పశువులను వదిలేయడంతో ఇక పంటలు వేయలేకపోయాడు. ఈ ఏడాది విస్తీర్ణం పెంచి సాగు చేసేందుకు నిర్ణయించాడు. ఏడాది పాటు దిగుబడి వచ్చిన వివిధ పంటల మొత్తం ఆదాయం 24,960లు వచ్చింది. దీనికి పెట్టుబడి ఖర్చులు రూ. 5వేలు పోను నికర ఆదాయం 19,960లు మిగిలింది.

ప్రధానంగా ఈ విధానంలో ప్రతి నెలా ఆదాయం రావడాన్ని రైతు గమనించాడు. అదేవిధంగా ఇంటి ఖర్చులు తగ్గిన విషయాన్ని పరిగణలోకి తీసుకున్నాడు. ఈ దఫా దీనిని మరింత విస్తరించి సాగు చేస్తే ఆదాయం పెరగడమే కాకుండా భూమికి మరింత ప్రయోజనం చేకూరుతుందని భావించి, రైతు నాగేశ్వరావు ఆ దిశగా అడుగులు వేశాడు.



8048

# సమూహ లబ్ధితోనే ప్రగతి పథం

**ఏ ఒక్కరికో ప్రయోజనం అందించి, మిగిలిన వారికి దూరం చేస్తే దాని ప్రగతి ఆశించిన స్థాయిలో జరగదు.. అలా కాకుండా సమూహంగా ఉండే సభ్యులకు అందజేస్తే దాని అభివృద్ధి ఫలాలు నలుగురికి చేరతాయి.. గ్రామ స్థాయిలో ఆర్థికంగా బలోపేతం అవుతారు. వీటివల్ల ఆ కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడటమే కాకుండా, వారి జీవన విధానంలోనూ మార్పులు తీసుకొస్తున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన వాసన్ సంస్థ సభ్యులతో కూడిన బృందాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రయోజిత పథకాలను అందజేస్తోంది.. వీటిని మరిన్ని గ్రామాలకు విస్తరించే దిశగా ప్రణాళికలు చేస్తూ ముందడుగు వేస్తోంది..**

**బృంద పథకాలకు ప్రాధాన్యత**

**విస్తరిస్తున్న అనుబంధ రంగాలు**

**మారుతున్న కుటుంబ జీవనం**

**ఆర్థికంగా స్థిరపడుతున్న కుటుంబాలు**



అల్లూరి సీతారామరాజు జిల్లా, దుంబ్రిగుడ మండలం, సొవ్వ క్లస్టరు, ఒడియ వలసకు చెందిన కిముడు గాసిరాంకు భార్యా ఇద్దరు చిన్న పిల్లలున్నారు. ఎకరాన్నర వరకు భూమి ఉంది. దీనిలో ఎకరం పోడు భూమిలో కాఫీ సాగు చేస్తున్నాడు. మిగిలిన అర ఎకరంలోని 20 సెంట్ల పల్లపు భూమిలో వరి పంటను సాగు చేసి, కుటుంబ ఖర్చుకు వినియోగించుకుంటాడు. 30 సెంట్లలో వర్షాలు కురిసే సమయంలో కూరగాయల సాగు చేయడం, మిగిలిన సమయాల్లో వృధాగా వదిలేసేవాడు. వర్షాలు కురిసే సమయంలో కూరగాయలు సాగు చేసినా, పంట దిగుబడులు వచ్చేవరకు వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే, ఎంతో కొంత ఆదాయం సాధించేవాడు. దానికి భిన్నమైన వాతావరణం ఉంటే కనీసం పెట్టుబడి సైతం వచ్చేది కాదు. ఈ పరిస్థితుల వల్ల కుటుంబ పోషణకు ఇబ్బంది కలిగేది. కనీసం పిల్లలకు బట్టలు తీసేందుకు సైతం ఆర్థిక సమస్య తలెత్తేది. దీంతో ఉన్నకాడికి కలో గెంజి తాగుతూ జీవనం సాగించేవారు. ఇదే రెండేళ్ల క్రితం గాసీరాం కుటుంబ పరిస్థితి. గ్రామంలో ఉండే గాసిరాం మాత్రమే కాదు.. కిముడు నందు, గెమ్మిలి పరశురాం ఇదే దీనస్థితిని అనుభవించేవారు. వీరంతా నిత్యం శ్రమ చేసే శక్తి ఉన్నా, క్షేత్రస్థాయిలో దానికి అనుగుణంగా సదుపాయాలు లేక నానా ఇబ్బందులు పడేవారు.

ఈ సమస్యల నుంచి అధికమించేందుకు వాసన్ సంస్థ చేయూత అందించింది. వీరి ముగ్గురి పొలాలు ఒకేచోట ఉండటంతో సామూహికంగా లబ్ధి జరిగేలా ప్రణాళికలు చేసింది.. ప్రధానంగా ఇక్కడ ప్రధాన సమస్య సాగునీరుగా గుర్తించింది. సంస్థ ప్రతినిధులు దానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో సదుపాయాలు కల్పించేందుకు సంకల్పించారు. ఈ భూములకు సమీపంలో ఎక్కడా సాగునీరు అందించే కాలువ, చెరువులు అందుబాటులో లేవు. దీంతో వీరు ముందుగా చెరువు తవ్వించాలని

నిర్ణయించారు. ఈ పనికి అయ్యే ఖర్చులో చుట్టుపక్కల రైతులను భాగస్వామ్యం చేశారు. వీరి నుంచి 30 శాతం నిధులను వసూలు చేసి, మిగిలిన 70 శాతం వాసన్ సమకూర్చి మూడు సెంట్ల విస్తీర్ణంలో చెరువును తవ్వించారు. వర్షాకాలంలో చేరిన నీటిని నిల్వ చేసుకుని పంటలు పండించుకునే విధంగా ప్రణాళికలు చేశారు. దీంతో పాటు చెరువు నుంచి నీటిని తమ పొలాలకు తరలించేందుకు వీలుగా అద్దె ప్రాతిపదికన డిజిల్ ఇంజన్ అందించి, పైపులు సమకూర్చారు.. దీనికయ్యే ఖర్చును పూర్తిగా సంస్థ భరించింది. అయితే దీనికి ఏడాదికి రూ. 8వేలు అద్దె రూపంలో చెల్లించాలని రైతులకు షరతులు విధించింది. ఈ విధంగా సాగుకు అవసరమైన సదుపాయాలు కల్పించి, ఏడాది పొడవునా చెరువు నుంచి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవడంతో ముగ్గురు రైతులు తమ భూముల్లో కూరగాయల సాగు చేపట్టేందుకు నిర్ణయించారు.



దీనిలో భాగంగా కిముడు గాసిరాం తనుకున్న 30 సెంట్ల భూమిలో వివిధ రకాలైన కూరగాయల పంటలు సాగు చేసేందుకు ఉల్లి, క్యారెట్ విత్తనాలను రూ. 3,500ల ఖర్చుతో సమకూర్చుకున్నాడు. తన వద్ద ఉన్న పశువుల గెత్తం వేసుకుని రూ. 500 ఖర్చుతో మూడు, నాలుగు దఫాలుగా దుక్కి చేయించి, నాట్లు వేసుకున్నాడు. ఈ పంటలకు వారానికి ఒకసారి చొప్పున ఐదు నెలలకు ఇంజిన్ సాయంతో చెరువులో ఉన్న నీటిని పంటకు అందించాడు. దీనికి రూ. 2వేలు ఖర్చయ్యింది. తక్కువ భూమి కావడంతో కలుపు ఇతర పనులను కుటుంబ సభ్యుల సహకారంతో పూర్తి చేసుకున్నాడు. మధ్యలో రూ. వంద ఖర్చుతో తయారు చేసిన ద్రవ జీవామృతాన్ని మూడు దఫాలుగా పారించాడు. ఈ విధంగా పంట కాలం పూర్తయ్యాక ఉల్లి రూ. 15వేలు, క్యారెట్ రూ. 10వేలకు అమ్మకం చేశాడు. ఈ పంటలతో వచ్చిన మొత్తం రాబడి రూ. 25వేలు కాగా, పెట్టుబడి రూ. 6,100 పోను, నికర ఆదాయం రూ. 18,900 మిగిలింది. గతంలో కనీసం పెట్టుబడులు రాని భూమిలో చెరువు, ఇంజన్ సమకూర్చడం వల్ల అనుకోకుండా లబ్ధి పెరిగింది.



వీటి ఆధారంగా సమీపంలో సాగు చేసే మరో రైతు కిముడు నందో.. తనకున్న 40 సెంట్ల విస్తీర్ణంలో ఉల్లి, క్యారెట్, బంగాళాదుంపలు, కొత్తిమిర విత్తనాలను రూ. 7,800ల ఖర్చుతో సమకూర్చుకున్నాడు. తన వద్ద ఉన్న పశువుల గెత్తం సాగు భూమిలో వేసి, రూ. 800ల ఖర్చుతో రెండు, మూడు దఫాలుగా దుక్కి చేసి నాట్లు వేసుకున్నాడు. దీనికి అవసరమైన సమయాల్లో వారానికి ఒకసారి చొప్పున ఐదు నెలల పాటు చెరువులో నీటిని రూ. 2వేలతో డీసిల్ కొని, ఇంజిన్ సాయంతో పంటకు నీటి తడులిచ్చాడు. కలుపు ఇతర పనులను కుటుంబ సభ్యుల సహకారంతో పూర్తిచేశాడు. మధ్యమధ్యలో రూ. 100ల ఖర్చుతో తయారు చేసుకున్న ద్రవ జీవామృతాన్ని పంటలో పారించాడు. ఈ విధంగా పంటకాలం పూర్తయ్యాక రూ. 25వేలకు ఉల్లి, రూ. 5వేలకు క్యారెట్, రూ. 6వేలకు బంగాళాదుంపలు, రూ. 6వేలకు కొత్తిమిర అమ్మకం చేశాడు. ఈ విధంగా మొత్తం రూ. 42వేల రాబడి రాగా, పెట్టుబడి ఖర్చులు రూ. 10,700లుపోను, నికర ఆదాయం రూ. 31,300లు మిగిలింది.

ఈ ఇద్దరి భూములను ఆనుకుని ఉన్న మరో రైతు గెమ్మిలి పరశురాం తనుకున్న 20 సెంట్ల విస్తీర్ణంలో కూరగాయల సాగు చేసేందుకు నిర్ణయించుకున్నాడు. దీనికి అనుగుణంగా రూ. 500ల బీన్స్, రూ. 800లతో ఉల్లి విత్తనాలను కొనుగోలు చేశాడు. తన వద్ద ఉన్న పశువుల గెత్తాన్ని సాగు భూమిలో వేసి రూ. 500ల ఖర్చుతో మూడు దఫాలుగా దుక్కిచేసి నాట్లు వేసుకున్నాడు. వారానికి ఒకసారి చొప్పున మూడు నెలల పాటు ఇంజన్ సాయంతో చెరువులో నీటిని పంటకు అందించాడు. దీనికి డీజిల్‌కు రూ. 1,200లు ఖర్చయ్యింది.

మరో రూ. 100లతో ద్రవ జీవామృతం సిద్ధం చేసుకుని, నాలుగు దఫాలుగా పంటలో పారించాడు. అయితే చివర్లో చెరువులో నీటి నిల్వలు తగ్గడంతో దాని ప్రభావం పంట దిగుబడిపై పడింది. ఈ విధంగా పంటకాలం పూర్తయ్యాక బీన్స్ రూ.5వేలు, ఉల్లి రూ. 5వేలు మొత్తం రూ. 10వేల రాబడి వచ్చింది. పెట్టుబడి ఖర్చులు రూ. 3,100లు పోను నికర ఆదాయం రూ. 6,900లు మిగిలింది.

ఈ విధంగా ఈ రైతులకు గతంలో ఎన్నడూలేని విధంగా ఆదాయం సమకూరడంతో కాస్త కుదుటపడ్డారు. గతంలో మాదిరి కాకుండా కుటుంబ పోషణకు సంబంధించి ప్రధాన అవసరాలకు ఖర్చు చేసేందుకు వెసులుబాటు కలిగింది. దీంతోపాటు పిల్లలకు బట్టలు ఇతర అవసరాలు తీర్చారు. వీటితో పాటు ప్రధానంగా మూడు నుంచి నాలుగు నెలల పాటు ఇంటి ఖర్చుకు సరిపడా కూరగాయలను ఈ సాగు నుంచి వినియోగించుకుని అదనపు ప్రయోజనాన్ని పొందారు. ఇలాంటి అనుకూల ఫలితాలు రావడంతో వచ్చే ఏడాది మరింత విస్తరించి, సాగు చేయాలని నిర్ణయించుకున్న రైతులు దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సంస్థ అందించిన సహకారంతో పంటలు పండించుకున్న రైతులు ప్రారంభంలో విధించిన షరతుల ప్రకారం ఇంజన్‌కు అద్దెను చెల్లించారు. వాసన్ సమకూర్చిన వసతుల వల్ల నేరుగా రైతు కుటుంబాలకు లబ్ధి జరిగిన విషయాన్ని గుర్తించిన మిగిలిన గ్రామస్తులు ముందుకొచ్చారు. ఇదే మాదిరి సదుపాయాలను మరింత విస్తరించి, తమకు సహకారం అందించాలని కోరడంతో సంస్థ ప్రతినిధులు తమ అంగీకారాన్ని తెలియజేశారు.



# ప్రకృతి పట్టు బిగుస్తోంది...

- నాలుగేళ్లుగా నాగరాజు ఇదే పద్ధతిలో సాగు
- ఏటా పెరుగుతూ వస్తున్న దిగుబడులు
- అధికమవుతున్న సేంద్రీయ కర్బనం
- నియంత్రణలో తెగుళ్లు, పురుగుల దాడి

**ప్రకృతి పద్ధతి ప్రారంభించిన వెంటనే ఒకేసారి మార్పు ఆశించడం అసాధ్యం.. మూడు., నాలుగేళ్ల పాటు ఇదే క్రమంలో వెళితే ఫలితం కనిపిస్తుంటుంది. ఈ పద్ధతిలో ఏటా భూమిలో ఇంకుతున్న జీవన ఎరువులు క్రమేపీ దాని స్థితిలో మార్పు తీసుకొస్తాయి. ఇతర విధానాలతో తగ్గిన సేంద్రీయ కర్బనం, మరలా పునరుజ్జీవం చెంది మొక్కలకు నిరంతరం తేమ అందించేలా దోహదం చేస్తోంది. ఈ విదంగా నాలుగైదు సంవత్సరాల తరువాత భూమి సంపూర్ణ పోషకత్వాన్ని పొందటంతో విస్తరించిన మిత్ర పురుగులు, శత్రు పురుగులను నియంత్రిస్తాయి. అదేవిదంగా దీనివల్ల భూమి పునరుజ్జీవం పొంది, సూక్ష్మపోషకాలు వృద్ధి చెంది చీడపీడలను నియంత్రించుకునే శక్తిని పొందుతుంది. వృద్ధి చెందిన వానపాముల వల్ల, అధికస్థాయిలో నత్రజని సహజంగా లభ్యమవడమే కాకుండా, లోతులో ఉన్న పోషకాలను మొక్కలకు అందిస్తుంటాయి. ఇలాంటి ప్రయోజనాల వల్ల ప్రతి ఏటా భూసారం పెరుగుతూ, దానికి అనుగుణంగా దిగుబడులు వృద్ధి చెందుతాయి. నాగరాజు సాగు చేసిన పంట విషయంలో ఇదే జరిగింది.. క్రమేపీ తెగుళ్లు తగ్గి, ఆరోగ్యకరమైన దిగుబడులు పెరుగుతూ వస్తున్నాయి.**

అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలం, డి.గొందూరు క్లస్టరు, సుకురుపుట్టు గ్రామానికి చెందిన రైతు కూడా నాగరాజు. కొండదొర తెగకు చెందిన ఆయనకు ఒకరే బాబు. తను పాడేరులో డిగ్రీ చదువుతున్నాడు. తన కొడుకును ఉన్నతస్థాయి ఉద్యోగిగా చూడాలనేది నాగరాజు కోరిక. 2.90 ఎకరాల భూమి ఉంది. దీనిలో 1.90 సెంట్లు పల్లపు భూమి కాగా, మరో ఎకరం పోడు సాగు చేసుకుంటున్నాడు. పల్లపు భూమిలో ఏటా వరి పంటను సాగు చేయడం ఆనవాయితీ. దీనిలో వచ్చిన ఉత్పత్తులను ఇంటి ఖర్చుకు వినియోగించుకుంటారు. అదనంగా వస్తే తోబుట్టువులు, కుటుంబ సభ్యులకు ఇస్తుంటారు. ఈ విధంగా నాలుగేళ్ల క్రితం 1.90 ఎకరాల విస్తీర్ణంలో సాధారణ పద్ధతిలో వరి పంటను సాగు చేశాడు. ముందుగా రూ. 1,100ల ఖర్చుతో 50 కిలోల విత్తనాలను సిద్ధం చేసుకున్నాడు. తరువాత భూమిని తన కాడి ఎద్దులతో పాటు మరో రెండు జతలను కూలీకి పెట్టి రూ. 2,000ల ఖర్చుతో మూడు, నాలుగు దఫాలుగా దుక్కి చేయించాడు. ఇదే దుక్కిలో రూ. 2,000ల ఖర్చుతో పశువుల గెత్తం వేయించాడు. దుక్కి చేసిన భూమిలో ఒక పక్కగా విత్తనాలు



చల్లించాడు. 20 రోజులు గడిచాక వర్షాలు రావడంతో మరో రూ. 700ల ఖర్చుతో దమ్ము చేయించి రూ. 1,000ల ఖర్చుతో నాట్లు వేయించాడు. సాధారణ పద్ధతిలో సాగు చేయడం వల్ల కలుపు ఎక్కువగా వచ్చింది. దీంతో రూ. 2వేల ఖర్చుతో మూడు దఫాలుగా కలుపు తీయించాడు. మరో పదిహేను రోజులు గడిచాక పంటపై తెగుళ్ళు, పురుగులు దాడి చేశాయి. అయితే పెట్టుబడి పెట్టేందుకు డబ్బుల్లేక అలానే వదిలేశాడు. నాలుగు, ఐదు పిలకలు మాత్రమే వచ్చాయి. పంట పక్వానికి వచ్చిన తరువాత రూ. 2,000ల ఖర్చుతో కోత కోయించి, నూర్పు చేయించాడు. చివరకు చూస్తే 10 బస్తాల దిగుబడి వచ్చింది. వీటిని అక్కడ పలుకుతున్న ధర బస్తాకు రూ. 1,200ల చొప్పున లెక్కిస్తే రూ. 12,000ల ఆదాయంలో పెట్టుబడి ఖర్చులు రూ. 10,800లు పోను, నికర ఆదాయం 1,200లు మిగిలింది. ఏటా ఆదాయం తగ్గుతూ రావడంతో నాగరాజులో బెంగ పట్టుకుంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తు కుటుంబం నెట్టుకురావడం కష్టమని ఆందోళన చెందాడు. ప్రత్యామ్నాయం వైపు దృష్టిసారించాడు. అదే సమయంలో రైతు సాధికార సంస్థ, వాసన్ సంస్థలు ప్రకృతి విధానంపై అవగాహన చేస్తుండగా విని అటుగా అడుగులు వేశాడు.

సంస్థల సలహా మేరకు 2018వ సంవత్సరం నుంచి ప్రకృతి పద్ధతిలో సాగు చేయడం ప్రారంభించాడు. గత ఏడాది ఖరీఫ్‌లో ఎకరం 90 సెంట్ల విస్తీర్ణంలో శ్రీ పద్ధతిలో వరి పంటను సాగు చేసేందుకు నిర్ణయించుకున్నాడు. దీనికి ముందుగా రెండు కిలోల బెల్లం, రెండు కిలోల సెనగపిండితో పాటు ఆవుపేడ, ఆవు మూత్రం, పుట్టమట్టితో కలిపి రెండు వందల కిలోల ఘన జీవామృతాన్ని సిద్ధం చేసుకున్నాడు. దీనికి రూ. 200ల వరకు ఖర్చయ్యింది. రూ. 90ల ఖర్చుతో 9 కిలోల దేశవాళీ విత్తనాలను తీసుకుని, బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకుని సిద్ధం చేసుకున్నాడు. ఇదే సమయంలో రూ. 2,000ల ఖర్చుతో భూమిని మూడు దఫాలుగా దుక్కి చేయించాడు. ఈ దుక్కిలో అప్పటికే సిద్ధం చేసుకున్న ఘన జీవామృతం వేయించాడు. తరువాత శుద్ధి చేసిన విత్తనాలను ఒక పక్కగా నారు పోసుకున్నాడు. 20 రోజులు గడిచాక వర్షాలు కురవడంతో మరో రూ. 700ల ఖర్చుతో దమ్ము చేయించి, రూ. 1,000లు చెల్లించి, కూలీలతో నాట్లు వేయించాడు. ఇది పూర్తయి నెల రోజులు గడిచాక పంటలో కలుపు వచ్చింది. రూ. 1,000లను కూలీలకు చెల్లించి శుభ్రం చేయించాడు. ఇదే సమయంలో మరో రూ. 300ల ఖర్చుతో 3 కిలోల బెల్లం, 3 కిలోల సెనగపిండి, ఆవు పేడ, ఆవు మూత్రం, పుట్టమట్టి కలిపి మూడొందల లీటర్ల ద్రవ జీవామృతాన్ని తయారు చేసుకుని మూడు దఫాలుగా పంటలో పారించాడు. ఇదే సమయంలో వర్షాలు ఎక్కువగా ఉండటంతో పంటపై కాండం తొలుచుపురుగు, ఆకుమచ్చ తెగులు ఆశించాయి. వేప ఆకులతో తయారు చేసుకున్న నీమాస్త్రం, కానుగ, శీతాఫలం, మారేడు, నీలగిరి వంటి ఆకులతో తయారు చేసిన అగ్నాస్త్రం కషాయాలను పంటపై రెండు దఫాలుగా పిచికారీ చేశారు. వీటికి వంద రూపాయల వరకు ఖర్చయ్యాయి. ఈ విధంగా తెగుళ్ల అదుపులోకి వచ్చాక పంటను చూస్తే బలంగా కనిపించింది. దుబ్బు లావుగా మారి, 72 వరకు పిలకలు వచ్చాయి. గతంలో ఎన్నడూలేనింతగా పిలకలు రావడంతో దిగుబడి పెరుగుతుందని గ్రహించాడు. పంటకాలం పూర్తయ్యాక రూ. 2,000ల ఖర్చుతో కోసి, నూర్పు చేయించాడు. అన్నీ పూర్తయ్యాక చూస్తే 18 బస్తాల దిగుబడి వచ్చింది. వీటిని అప్పటి ధరకు బస్తా ఒక్కంటికి రూ. 1,500ల చొప్పున లెక్కించగా రూ. 27,000ల ఆదాయం వచ్చింది. వీటిలో పెట్టుబడి ఖర్చులు రూ.7,390లు పోను నికర ఆదాయం రూ. 19,610లు మిగిలింది. ఈ విధంగా నాలుగేళ్లుగా ఈ విధానంలో సాగు చేయడం వల్ల భూమి గుల్లబారి, వానపాములు పెరగడంతో పాటు భూసారం క్రమేపీ మెరుగవుతున్నట్టు గమనించాడు. రైతు నాగరాజు ఇదే విస్తీర్ణంలో సాగు చేస్తే 2018లో 12, 2019లో 14, 2020లో 16 బస్తాలు దిగుబడి వచ్చింది. గత ఏడాది మరో శ్రీ పద్ధతిలో మరో రెండు బస్తాలు పెరిగాయి. సంస్థల ప్రతినిధులు చెప్పినట్టు ప్రకృతి పద్ధతిలో ఏటా దిగుబడి పెరుగుతూ వస్తున్న విషయం గుర్తించిన రైతు సంతోషించాడు.



# చేయూతనిస్తే సిరులే...





**సహజ వనరులకు అనుగుణంగా సాయం**

**అద్దె ప్రాతిపదికన అందజేసిన డీసిల్ ఇంజన్**

**నీటి తడులిస్తూ చేపట్టిన కూరగాయల సాగు**

**నాలుగు నెలల కాలంలో అర లక్ష ఆదాయం**

**ఏజెన్సీలో పంటల సాగంటే వర్షాలు పడితే ఉన్నట్టు.. లేకపోతే లేనట్టు.. పూర్వం నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది... ఇటీవల కాలంలో కొంతమంది రైతులు ప్రభుత్వాలు, సంస్థల సాయాన్ని అందిపుచ్చుకుంటున్నారు.. దీనికి వారి శ్రమను జోడించి అద్భుతాలు సృష్టిస్తున్నారు... వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తున్నారు. కాలాలతో సంబంధం లేకుండా వివిధ రకాలైన పంటలు సాగు చేస్తూ అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.. ఈ సాయం ఒక్కరికే పరిమితం కాకుండా కాకుండా చుట్టుపక్కల రైతులకు అందించి, వారు అభివృద్ధి చెందే దిశగా తమ వంతు సహకారం అందిస్తున్నారు...**

అల్లూరి సీతారామరాజు జిల్లా, దుంబ్రిగుడ మండలం, సొవ్వ క్లస్టరు, ఒడియ వలసకు చెందిన రైతు కిముడు జ్యోతి బసు. తనకు భార్యతో పాటు ముగ్గురు చిన్నపిల్లలు. జ్యోతిబసుకు రెండెకరాల భూమి ఉంది. ఈ భూమిలో పంటలు సాగు చేసి, దీనిపై వచ్చే ఆదాయంతోనే కుటుంబం మొత్తం జీవనం సాగించాల్సి వచ్చేది. ఏజెన్సీలో భిన్నమైన వాతావరణం ఉంటుంది. కురిస్తే ఏకదాటిగా వర్షాలు కురుస్తూనే ఉంటాయి. లేకపోతే మరలా వెనక్కి



తిరిగి చూసుకునే అవకాశం ఉండదు. ఇలాంటి పరిస్థితుల వల్ల సాగు చేసిన పంట చేతికొచ్చే వరకు నమ్మకం ఉండదు. రైతు జ్యోతిబసుది ఇదే పరిస్థితి. ఏటా వర్షాలు కురిసే సమయానికి పంటలు సాగు చేయడం, వస్తే వచ్చినట్టు.. లేకపోతే లేనట్టు ఉండేది. ఇలాంటి పరిస్థితుల ప్రభావం కుటుంబ పోషణపై పడేది. సమీపంలోనే ఎటువంటి సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో ఏటా ప్రకృతినే నమ్ముకోవాల్సి వచ్చేది. సాగు చేసిన పంటలు నష్టపోవాల్సి వచ్చేది.

దీన్ని అధికమించేందుకు పలుమార్లు ప్రయత్నం చేసినా సఫలీకృతం కాలేదు. ఇదే సమయంలో ప్రకృతి సేద్యంపై అవగాహన చేస్తున్న వాసన్ సంస్థ ముందుకొచ్చింది.. దీనిలో భాగంగా సంస్థ ప్రతినిధులు రైతు పరిస్థితి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతు చేసే శ్రమకు తగ్గట్టు నీటి వనరులను అభివృద్ధి చేసి, దాని నుంచి నీటిని అందించేందుకు డీజిల్ ఇంజన్ ఉంటే చాలా వరకు సమస్యను పరిష్కరించవచ్చని భావించారు. దానికి అనుగుణంగా ముందుగా మూడు సెంట్ల విస్తీర్ణంలో చెరువును తవ్వేందుకు నిర్ణయించారు. దీనిలో రైతుకు సైతం భాగస్వామ్యం ఉంచే విధంగా 30 శాతం నిధులు సమకూర్చే విధంగా షరతులు విధించారు. మిగిలిన 70 శాతం నిధులు ఖర్చు చేసేందుకు సంస్థ ముందుకొచ్చింది. అదేవిధంగా దీని నుంచి నీటిని రైతు భూములకు తరలించే విధంగా అద్దె ప్రాతిపదికన డీజిల్ ఇంజనుతో పాటు పైపులను సమకూర్చింది. దీనిని వినియోగించుకున్న రైతు ఏటా రూ. 8వేల వరకు అద్దె చెల్లించాలని షరతులు విధించింది. ఈ నిధులను తిరిగి రైతు ఉత్పత్తిదారుల సంఘంలో జమ చేసే విధంగా నిబంధనలు విధించింది. భవిష్యత్తులో సంఘంలో ఉన్న రైతు ప్రతినిధులకు అవసరానికి తగ్గట్టు నిధిని సమకూర్చడంలో భాగంగా సంస్థ ప్రతినిధులు ఈ రికవరీ పద్ధతిని అమలు చేస్తున్నారు.

వాసన్ సంస్థ హామీ ఇచ్చినట్టుగా చెరువును తవ్వించారు. దానికి అనుగుణంగా రూ. 32 వేల వ్యయంతో డీసిల్ ఇంజన్‌తో పాటు జ్యోతిబసు పొలం వరకు సరిపడా పైపులను అందించారు. దీనిని వినియోగించుకునే విధానంపై రైతుకు అవగాహన చేసి, అప్పగించారు. రైతు జ్యోతిబసుకు ధైర్యం వచ్చింది... వాతావరణం అనుకూలంగా లేని సమయంలో సైతం దీనిని వినియోగించుకుని పంటలు పండించవచ్చని సంతోషించాడు. దానికి అనుగుణంగా తనకున్న రెండెకరాల భూమిలో ఎకరం విస్తీర్ణంలో వరి పంటను సాగు చేశాడు. మరో అర ఎకరం భూమిలో కూరగాయల సాగు చేపట్టేందుకు నిర్ణయించాడు. దీనిలో పశువుల గెత్తాన్ని వేసి, మూడు దఫాలుగా భూమిని దుక్కి చేశాడు. దీనికి రూ. 3,500ల వరకు ఖర్చయ్యింది. అదేవిధంగా ఉల్లి, క్యారెట్, బంగాళా దుంపలు, టమోటా, స్వీట్ కార్న్, కొత్తిమిర, తియ్యదుంప సాగు చేసేందుకు నిర్ణయించి, రూ. 11,500ల ఖర్చుతో వాటి విత్తనాలను సమకూర్చుకుని సిద్ధమయ్యాడు.



దుక్కి చేసిన భూమిలో వీటిని తీసుకుని నాట్లు వేసుకున్నాడు. తాను స్వతహాగా శ్రమ జీవి కావడంతో అన్ని పనులు తనే స్వయంగా చేసుకునేవాడు. నెల రోజులు గడిచాక పంటలో కలుపు రావడంతో వీడిర్‌తో తనే స్వయంగా తీసుకున్నాడు. వారానికి ఒకసారి అవసరమైనప్పుడు ఇంజన్‌తో పంటకు తడులిచ్చేవాడు. మధ్యలో ఒకసారి తీవ్రంగా వర్షాలు వచ్చి పంట కాస్త దెబ్బతింది. అయినా మిగిలిన దానికి ఇబ్బంది లేకుండా అవసరమైన సమయాల్లో నీటిని అందించారు. డిశెంబరు నెలాఖరుకు చూస్తే ఉల్లి రూ. 35వేలు. క్యారెట్ రూ. 15వేలు, బంగాళాదుంపలు రూ. 5వేలు, టమోటా రూ. 2వేలు, స్వీట్ కార్న్ రూ. 3వేలు, తియ్యదుంప రూ. 10వేలు, కొత్తిమిర రూ. 2వేలు వచ్చాయి. ఈ విధంగా మొత్తం రూ. 72వేల ఆదాయం వచ్చింది. వీటిలో ఇంజన్ డీజిల్‌కు అయిన ఖర్చులతో కలిసి మొత్తం రూ. 18వేలు కాగా, నికర ఆదాయం రూ. 54వేలు మిగిలింది. కేవలం నాలుగు నెలల్లో కూరగాయలను సాగు చేసి రూ. 54వేల ఆదాయం సాధించిన జ్యోతిబసు అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ఈ విధంగా సమకూరిన రాబడిలో ఇంజన్ అద్దెకు రూ. 8వేలు చెల్లించాడు. ఇదే కాకుండా చెరువు నుంచి నీటిని వాడుకుంటున్న రైతు జ్యోతిబసు మిగిలిన సమయాల్లో దానిలో చేపల పెంపకం చేపట్టాడు. అప్పట్లో వాసన్ అందించిన చేప పిల్లలను కొనుగోలు చేసి, చెరువులో వేశాడు. వీటికి మేతగా అప్పటికే సిద్ధం చేసుకున్న ఘన జీవామృతాన్ని వేసేవాడు. దీంతో పాటు చెరువులో నాచు, చిన్నచిన్న మొక్కలు తిన్న చేపలు ఆరు నెలల్లో దాదాపుగా కిలో బరువు పెరిగాయి. వీటిని అవసరమైన సమయాల్లో ఇంటికి వాడుకున్న రైతు, ఆరు నెలల తరువాత అమ్మకం చేసి, మరో రెండు వేలు అదనంగా లబ్ధి పొందాడు. గతంలో కనీసం పెట్టుబడయినా రాని భూమిలో ఒక్కసారే ఆదాయం కనిపించడంతో రైతు జ్యోతిబసు సంతోషించాడు. వాసన్ సంస్థ అందించిన సాయంతోనే తను ఈ ఆదాయం సాధించినట్టు గ్రహించాడు. వీటి లబ్ధిని తనకే పరిమితం చేయకుండా సమీప రైతులు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాడు. భవిష్యత్తులో అందరూ సంయుక్తంగా కలిసి లబ్ధి పొందేలా ప్రణాళికలు చేసుకున్న రైతులు దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు..

ఆహార ధాన్యాల ఉత్పత్తిలో విచ్చలవిడిగా వాడుతున్న ఎరువులు, క్రిమి సంహారక మందులు, వినియోగదారులపై విషం చిమ్ముతున్నాయి. ఈ ఉత్పత్తుల్లో రసాయనాలను దూరం చేసేందుకు రైతు సాధికార సంస్థ ప్రకృతి పద్ధతిలో సాగు విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఇది క్రమేణా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తోంది. ఈ పద్ధతిని ఇంతవరకు ఒక పంటకు పరిమితం చేసి, మిగిలిన సమయాల్లో భూమిని ఖాళీగా వదిలేస్తున్నారు. దీనివల్ల భూమిల్లోని సూక్ష్మపోషకాలు నశించి, నిస్సారంగా మారుతున్నాయి. రెండో ప్రయత్నంగా వీటిని కట్టడి చేసేందుకు రుతుపవనాలకు ముందు సాగు ప్రారంభించే పీఎండీఎస్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఈ పద్ధతిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న వాసన్ సంస్థ గ్రామాల్లో ఈ విధానాన్ని విస్తరిస్తోంది. దీన్ని అందిపుచ్చుకున్న రైతు లక్ష్మణ్ ఇదే విధానంలో సాగు చేసి, ఆర్థికంగా, ఆరోగ్య పరంగా పలు ప్రయోజనాలు పొందుతూ, ఇతరులకు మార్గదర్శిగా నిలిచాడు.



- పీఎండీఎస్ పద్ధతిలో ఏడాది పాటు పంటలు
- భూమికి సమకూరుతున్న సూక్ష్మపోషకాలు
- ఇంటి ఖర్చుతో పాటు పెరిగిన ఆదాయం
- పలువురికి ఆదర్శంగా రైతు లక్ష్మణ్

# ప్రకృతి సాగులో మలిమెట్టు...

అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలం, డి.గొందూరు పంచాయతీ, సుకురుపుట్టు గ్రామానికి చెందిన రైతు సతక లక్ష్మయ్య. తను ఇంటర్ వరకు చదువుకున్నారు. కొండదొర తెగకు చెందిన ఈయనకు ఇద్దరు పిల్లలు. పాప విశాఖలో డిగ్రీ, బాబు ఇంటర్ చదువుతున్నారు. తనకు తల్లిదండ్రుల ద్వారా సంక్రమించిన మూడెకరాల భూమి ఉంది. దీనిలో ఎకరాన్నర పల్లంలో ఏటా వరి పంటను సాగు చేసి, ఇంటి ఖర్చుకు వినియోగించుకుంటున్నారు. మరో అర ఎకరం కొండపోడులో కాఫీ సాగు చేస్తున్నాడు. మిగిలిన ఎకరం కొండ వాలు ప్రాంతంలోని మెట్ట భూమిలో ఇంతవరకు పసుపు, అపరాలు వంటి పంటలు సాగు చేసేవాడు. ఈ విధంగా తనకున్న భూమిలో వీలైనన్ని ఎక్కువ పంటలు సాగు చేసి, పిల్లల్ని చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎకరం మెట్ట భూమిలో వర్షాల సమయంలో పంటలు సాగు చేస్తున్న రైతు లక్ష్మణ్, దిగుబడి వచ్చిన తరువాత ఖాళీగా వదిలేసేవాడు. తను ఐదేళ్ల క్రితం వరకు సాధారణ పద్ధతిలోనే అన్ని పంటలు పండించేవాడు. అప్పట్లో ఇంటి దగ్గర పశువులతో సమకూర్చుకున్న గెత్తంను పంటలో వేయడం, సాగు చేయడం ఆనవాయితీగా వస్తుండేది. పంటకు చీడపీడలు తగిలినా అలానే వదిలేసేవారు. ఇలాంటి పద్ధతుల వల్ల ఎకరాన్నర భూమిలో కేవలం 8 బస్తాల వరకు దిగుబడి వచ్చేది. అదే సమయంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి సాగుపై అవగాహన చేస్తుండగా విని అటువైపు అడుగులు వేశాడు. ప్రారంభంలో ఘన జీవామృతం వేసి, ప్రకృతి విధానంలో వరి పండించడం ప్రారంభించాడు. అప్పట్నుంచి ఇదే విధానంలో సాగు చేయడం వల్ల ప్రతి ఏటా పెరుగుతూ 2021కు 30 బస్తాల దిగుబడికి చేరుకుంది. ఇలా అన్ని పంటలకు ప్రకృతి పద్ధతిని అనుసంధానం చేసినా, ఏడాది పొడవునా పంటల సాగు చేపట్టడం లేదు. ఈ విధంగా అరకొర సాగు వల్ల కలిగే అనర్థాలను వివరించిన రైతు సాధికార సంస్థ, వాసన్ సంస్థలు ఏడాది పాటు భూమిని కప్పి ఉంచే విధంగా రుతుపవనాలకు ముందు (పీఎండీఎస్) అధిక సంఖ్యలో పంటలు సాగు చేస్తే భూమి, రైతులకు కలిగే ప్రయోజనాలను

తెలియజేశారు. ఇప్పటికే ప్రకృతి విధానంతో తొలి అడుగు వేసి, వరి సాగులో మూడు రెండు రెట్లు దిగుబడి పెంచుకున్న రైతు లక్ష్మణ్, రెండో దఫా పీఎండీఎస్ పద్ధతిలో సాగు చేసేందుకు నిర్ణయించుకున్నాడు.

దీనిలో భాగంగా తన ఎకరం మెట్టు భూమిలో 2021 ఖరీఫ్ నుంచి పీఎండీఎస్ పద్ధతిలో సాగు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాడు. ముందుగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇదే భూమిలో పశువుల గెత్తం వేసుకున్నాడు. ఏప్రిల్ వర్షాలు రావడంతో మూడు దఫాలుగా దుక్కి చేసి, సాగుకు సిద్ధం చేసుకున్నాడు. దీనికి ముందుగా రెండు కిలోల బెల్లం, రెండు కిలోల సెనగపిండి, పుట్టమట్టి, అవసరమైనంత పశువుల పేడ, మూత్రాన్ని సమీకరించుకుని రూ. 200ల ఖర్చుతో ఘన జీవామృతాన్ని తయారు చేసుకుని, మేలో కురిసిన వర్షాలకు మరో మారు దుక్కి చేసి, దానిలో వేయించాడు. ఈ విధంగా 1,200ల ఖర్చుతో దుక్కి పనులు పూర్తి చేసుకున్నాడు. ఈ పనులు పూర్తయ్యాక నెలాఖరులో అప్పటికే సిద్ధం చేసుకున్న పసుపు, పిప్పళ్లు, దుంపలు, బస్తర్లు, బీన్స్, నేల చిక్కుళ్లు, అలసందలు, గుమ్మడి, చారు దుంపలు, నాగలి దుంప, కుండ దుంపలు, చేమ దుంపలు విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకుని నాటుకున్నాడు. వీటితో పాటు మధ్యమధ్యలో తోటకూర, గోంగూర, కొత్తిమిర, వంకాయ, బీరకాయ, బెండ, ఆనప కాయలను సాగు చేసుకున్నాడు. విత్తనాలకు రూ. 8వేల వరకు ఖర్చయ్యింది. విత్తనాలు వేసుకునేందుకు రూ. 1,000లు ఖర్చయ్యాయి. ఈ విధంగా అన్ని పంటలు సాగు చేసుకుని నెల రోజులు గడిచాక దిగుబడులు రావడం ప్రారంభించాయి. ముందుగా జూన్, జూలై నెలల్లో ఆకుకూరలు దిగుబడి రావడంతో తన ఇంటి ఖర్చుకు వినియోగించుకుని, మిగిలిన వాటిని అమ్మకం చేశాడు. ఈ విధంగా మిగిలిన వాటిని అమ్మకం చేయగా రూ. 1,200లు వచ్చింది. వీటి దిగుబడి పూర్తయ్యాక రూ. 200ల ఖర్చుతో రెండు కిలోల బెల్లం, రెండు కిలోల సెనగపిండి, ఆవుపేడ, మూత్రం, పుట్టమట్టితో కలిపి రెండు వందల లీటర్ల ద్రవ జీవామృతాన్ని తయారు చేసుకున్నాడు. వీటిలో వంద లీటర్ల వరకు పంటపై పిచికారీ చేసుకున్నాడు. మరలా అదేచోట ఆకుకూర విత్తనాలను వేసుకున్నాడు. ఆగష్టు నెలలో కూరగాయలు వంగ, బీర, బెండ, ఆనప కాయలు దిగుబడి వచ్చాయి. వీటిని నెల రోజుల పాటు ఇంటి ఖర్చుకు వినియోగించుకుని, మిగిలిన వాటిని రూ. 1,600లకు అమ్మకం చేశాడు. కూరగాయల దిగుబడి తగ్గాక అప్పటికే తయారు చేసుకున్న ద్రవ జీవామృతాన్ని మరో మారు పిచికారీ చేసుకున్నాడు. ఇలా వీటి దిగుబడి తగ్గిన వెంటనే సెప్టెంబరు నెలాఖరు నుంచి అక్టోబరు వరకు మరలా ఆకుకూరలు దిగుబడి వచ్చాయి. వీటిని నెల పదిహేను రోజుల పాటు ఇంటి ఖర్చుకు వినియోగించుకున్నారు. ఈ సమయంలో వర్షాలు ఎక్కువగా రావడంతో ఆకుకూరల పంట తక్కువగా వచ్చింది. ఇవి పూర్తయ్యేసరికి దిగుబడి వచ్చిన నాగలి దుంపలు రూ. 3,000లు, చేమ దుంపలు రూ. 1,500లు, అలసందలు రూ. 500లు, నేల చిక్కుళ్లు రూ. 1,500లు, గుమ్మడి కాయలు రూ. 1,500లు వచ్చాయి. కుండ దుంపలు ఇంటి ఖర్చుకే సరిపోయాయి. నవంబరు నెలలో దిగుబడి వచ్చిన చారు దుంపలు రూ. 1,500లు, బస్తరు పిక్కలు రూ. 2,000లు, బీన్స్ రూ. 1,000లు వచ్చాయి. వీటిని ఇంటి ఖర్చుకు వాడుకుంటూ మార్కెట్‌లో అమ్మకం చేయడం వల్ల ఈ రాబడి వచ్చింది. ఇక చివరిగా డిశెంబరు, జనవరి నెలల్లో పసుపు నుంచి రూ. 15వేలు, పిప్పళ్లు నుంచి రూ. 20వేల ఆదాయం





సమకూరింది. ఇదే సమయంలో కూరగాయలు సైతం దిగుబడులు రావడంతో ఇంటి ఖర్చుకు సరిపోయేది. మొత్తం ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈ భూమిలో సాగు చేసిన ఏదో ఒక పంట నుంచి దిగుబడులు వస్తూనే ఉన్నాయి. ఇక్కడ పశువులు వదిలేసే అలవాటు ఉండటంతో అవి పాడు చేస్తాయనే కారణంతో మార్చిలో ఏ పంట వేయకుండా భూమిని ఖాళీగా వదిలేశాడు. భవిషత్తులో భూమికి చుట్టూ కంచె వేసి ఏడాది పాటు పూర్తిగా సాగు చేసుకునేందుకు నిర్ణయించుకున్నాడు.

ఈ విధంగా ఏప్రిల్‌లో ప్రారంభించిన వివిధ రకాలైన పంటల నుంచి ప్రతి నెలా ఆదాయం రావడంతో రైతు ఆర్థికంగా లబ్ధి పొందాడు. దీంతో పాటు అదనంగా ఇంటి ఖర్చుకు సరిపడా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పొందేందుకు వీలయ్యింది. కేవలం ఎకరం భూమి నుంచి ఇన్ని విధాలుగా అందిన ప్రయోజనాన్ని గతంలో ఎన్నడూ చూడలేదని రైతు లక్ష్మణ్ సంతోషించాడు. ఈ విధంగా మార్చి మినహా పదకొండు నెలలు భూమిని కప్పి ఉంచే విధంగా పీఎండీఎస్ పద్ధతిలో వివిధ పంటలు సాగు చేయడం వల్ల నేలలో సూక్ష్మ పోషకాలు వృద్ధి చెంది, సారవంతమయ్యేందుకు దోహదపడింది. దీంతో పాటు ఎకరంలో సాగు చేసేందుకు రూ. 10,600లు ఖర్చుకాగా, దిగుబడులు అమ్మకం చేయగా రూ. 50,300లు ఆదాయం వచ్చింది. ఖర్చులు పోను నికర ఆదాయం చూస్తే 39,700లు మిగిలింది. ఇదేకాకుండా నెల మినహా సంవత్సరం మొత్తం ఇంటి ఖర్చుకు సరిపడా కూరగాయలు సమకూరాయి. ఈ విధంగా పీఎండీఎస్ పద్ధతిని అనుసరించడం వల్ల గతంలో ఎన్నడూలేని విధంగా ప్రయోజనాలు అందడంతో రైతు లక్ష్మణ్ ఆనందించాడు.

❋ ❋ ❋ ❋ ❋

# అనుబంధ రంగాల అభివృద్ధే వాసన్ ధ్యేయం

**గిరి రైతు నిలదొక్కుకునేందుకు కార్యాచరణ**

**దేశీయ కోళ్లు, మేకల పెంపకంపై ప్రత్యేక దృష్టి**

**వ్యాక్సిన్లు విస్తృతం చేసేందుకు చర్యలు**

**ఈ రోజుల్లో కేవలం వ్యవసాయంతో రైతు మనుగడ కష్టం... దాని అనుబంధ రంగాలకు విస్తరిస్తేనే నిలదొక్కుకునే అవకాశం ఉంది. ఏజెన్సీ వాతావరణానికి అనుకూలమైన కోళ్లు, మేకలు, చేపలు వంటి రంగాలను విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాటిలోని ఒడిదుడుకులను సరిచేసి, నిరంతరం గిరి రైతుకు ఆదాయవనరుగా మార్చేదిశగా 'వాసన్' ప్రణాళికలు చేసింది. వీటి నిరంతర అభివద్ధికి ఢోకా లేకుండా వ్యాక్సినేషన్ ప్రక్రియకు ప్రత్యేక కార్యాచరణ చేసింది... క్షేత్రస్థాయిలో దానికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ చర్యలు తీసుకుంది.. తొలుత ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును విజయవంతం చేసి, అల్లూరి జిల్లా వ్యాప్తంగా విస్తరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది.**



గిరిజనుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే విప్లవవీరుడు అల్లూరిసీతారామరాజు పేరుతో పాడేరు కేంద్రంగా వెలిసిన కొత్త జిల్లాలో గిరి రైతుల అభివృద్ధిని కాంక్షిస్తూ 'వాసన్' సంస్థ నడుం బిగించింది. ముందుగా ఇక్కడి రైతులంతా ప్రకృతి సాగు చేపట్టేలా ప్రోత్సాహాన్నందిస్తోంది. గిరి రైతులు పండించిన ఉత్పత్తులు, దాదాపుగా వారే వినియోగించుకునే పరిస్థితి ఉంటుంది. దీన్ని అధికమించి ఆదాయం పెరగాలంటే అనుబంధ రంగాలకు విస్తరించి, అభివృద్ధి చేయడం తప్పనిసరని గ్రహించింది. వారంతా ఇప్పటికే చేపట్టిన కోళ్లు, మేకల పెంపక రంగాలను వ్యాధుల బారి నుండి కాపాడి, మరింత విస్తరించేందుకు అవసరమైన చర్యలు ప్రారంభించింది. వీటి నిరంతర అభివృద్ధికి దోహదపడే వ్యాక్సినేషన్ కార్యక్రమం విస్తరించేందుకు ఏర్పాట్లు చేసింది. నిరంతరం విద్యుత్ సౌకర్యం అందుబాటులో లేని మారుమూల గ్రామాల్లో సైతం వ్యాక్సిన్లు నిల్వ ఉంచి, కోళ్లు, మేకలకు అందించేలా అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేసి, దానికి అవసరమైన సిబ్బందిని నియమించి, తగు చర్యలు చేపట్టింది.



దుంబ్రిగుడ మండలం, సాగర పంచాయతీ, సిమిలిగుడ గ్రామంలో వ్యాక్సిన్లు భద్రపరిచేందుకు సుమారుగా రూ. 4 లక్షల వ్యయంతో 120 లీటర్ల కెపాసిటీతో ప్రత్యేక కూలింగ్ ఛాంబర్ ఏర్పాటు చేసింది. ఇక్కడ సోలార్ పద్ధతి ద్వారా నిరంతరం విద్యుత్ సౌకర్యం అందేలా ప్లేట్లను అమర్చారు. దీనికి అనుగుణంగా సుమారుగా 600 వ్యాక్సిన్లు భద్రపరిచేందుకు అనువుగా కూలింగ్ ఛాంబర్, వ్యాక్సినేటర్లను అందించి, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విస్తరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించేందుకు 2016 నుంచి ప్రకృతి పద్ధతిలో వివిధ రకాలైన చిరుధాన్యాలు, కూరగాయలు, వరి పంటలు సాగు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచిన సిందేరి మహేష్‌కు వ్యవస్థాపక బాధ్యతలు అప్పగించింది. దుంబ్రిగుడ మండలంలోని సాగర, సొవ్వ, గసభ పంచాయతీల పరిధిలోని 60 గ్రామాలకు వ్యాక్సినేషన్ సేవలు అందించేలా లక్ష్యం విధించింది.



సాధారణంగా తొలకరిలో మార్చి నుంచి జూన్ నెలల మధ్యలో కోళ్లకు అమ్మవారు, రెక్కల విరుపుడు, మెడ విరుపు, నీళ్ల విరోచనాలు, తెల్లపారుడు, పచ్చపారుడు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే మేకలు, గొర్రెలకు గోట్ ఫాక్స్, సిప్ ఫాక్స్ వంటి వ్యాధులు వస్తాయి. వీటికి ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్లు వేస్తే ఈ వ్యాధుల బారినుంచి తప్పించుకోవచ్చు. అయితే వ్యాక్సిన్లు కలిపిన తరువాత రెండు గంటల లోపు వాటిని వినియోగిస్తేనే ప్రయోజనం ఉంటుంది. అలాకాని పక్షంలో వృధా అవుతాయి. ఇవి వృధా కాకుండా ఉండేందుకే కూలింగ్ చాంబర్‌ను ఏర్పాటు చేసి, వ్యాక్సినేటర్లు సమకూర్చారు.

ఈ వ్యాక్సిన్లు ప్రభుత్వ పశు వైద్యశాల నుంచి లేదా మెడికల్ షాపుల్లోంచి తీసుకొచ్చి, కూలింగ్ ఛాంబర్‌లో భద్రపరిచి, అవసరమైన వాటికి వేస్తుంటారు. ఈ విధంగా మార్చి 22 నుంచి జూలై నెలాఖరు వరకు 536 కోళ్లకు వ్యాక్సిన్లు వేశారు. ఒక్కో కోడికి వ్యాక్సిన్ వేసేందుకు రూ. 2లు, గొర్రెలు, మేకలకు రూ. 5లు చెల్లించేలా షరతులు విధించారు. వ్యాక్సిన్లు వేయడం వల్ల అనుబంధ రంగాలను ప్రోత్సహించడమే కాకుండా, వీటిని వేసిన వారికి నిర్వహణ వ్యయాన్ని వసూలు చేసిన మొత్తంతో జీవనోపాధి కల్పించే దిశగా ఈ చర్యలు తీసుకుంది. కోళ్లకు ఉదయం 6 నుంచి 8.30 గంటలలోపు, సాయంత్రం ఆరు దాటిన తరువాత ఈ వ్యాక్సిన్లు వేయాల్సి ఉంటుంది.

సాధారణంగా గిరి రైతులు ఎక్కువ స్థాయిలో దేశీయ కోళ్లను పెంచుతుంటారు. ఇవి చుట్టుపక్కల ఉండే మొక్కలు, పురుగులను తినడంతో బలిష్టంగా తయారవుతాయి. ఇవన్నీ గుంపుగా ఉంటూ తిరుగుతుంటాయి. తొలకరి సమయాల్లో వీటిలో ఏ ఒక్కదానికైనా ఒక వ్యాధి వస్తే, అది వేగంగా విస్తరించి, మొత్తం చనిపోయే ప్రమాదముంది. గుంపులుగా తిరిగిన కోళ్లన్నీ ఒక్కసారే మాయమయ్యే పరిస్థితి ఉంటుంది. వాసన్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వ్యాక్సినేషన్ ప్రభావం వీటన్నింటిపై ఉంటుంది. ముందుగా వీటికి వ్యాక్సిన్లు వేయడం వల్ల వీటిని వ్యాధుల బారి నుంచి కాపాడేవీలుంటుంది. ఆరోగ్యంగా ఉండే కిలోన్నర కోడి పుంజును రూ. 800 నుంచి రెండు వేల వరకు అమ్మకం చేస్తుంటారు. పండగ సమయాల్లో అయితే నేరుగా ఇళ్లకొచ్చి అధిక ధరలకు కొనుగోలు చేయడం ఆనవాయితీ.

ఈ విధంగా వ్యవసాయ అనుబంధ రంగాలైన దేశీయ కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకాన్ని విస్తరించేందుకు వాసన్ పరోక్షంగా సహకరిస్తూ గిరి రైతుల ఆదాయాన్ని పెంపొందించే దిశగా తన వంతు కృషి చేసి, సఫలీకృతమవుతోంది..



ఏజెన్సీలో వాతావరణం ఎవరికీ తెలియంది కాదు... కురిస్తే ఒకేసారి వాగులు, గెడ్డలు పొంగేటట్టు వర్షాలు రావడం.. లేనిపక్షంలో ఎండ బెట్టడం.. ఇదే జరుగుతుంటుంది... ఈ వాతావరణాన్ని నమ్ముకున్న ఆదివాసీ రైతులు పలు రకాలైన పంటలు సాగు చేస్తూ, దిగుబడులు రాక నష్టపోతున్నారు.. వీళ్లు ఎంత శ్రమ చేసినా సమయానుకూలంగా పంటకు నీరందించకపోవడం వల్ల ఈ దుస్థితి వస్తోంది... అక్కడక్కడా కొండ గెడ్డల నుంచి నిత్యం నీటి ప్రవాహాలున్నా... వాటిని రైతుల భూముల చెంతకు తీసుకురావాలంటే సాధ్యంతో కూడుకున్న వ్యవహారం కాదు.. ఈ విధమైన పరిస్థితుల వల్ల ఆదివాసీలు పడుతున్న కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు... ఇదే విషయాన్ని వాసన్ సంస్థ గుర్తించింది... రైతులు పడుతున్న శ్రమకు వనరుల రూపేణా కాస్త సాయమందిస్తే తిరుగుండదని గ్రహించింది.. క్షేత్రస్థాయిలో నీటి వసతులను కల్పించి, వాటి నుంచి భూములకు నేరుగా నీరు చేరేలా ఇంజన్ సదుపాయం ఏర్పాటు చేసి, ఆదివాసీలను తిరుగులేని రైతులుగా తీర్చిదిద్దుతోంది...

# రైతు శ్రమకు... వనరుల సాయం తోడైతే...



**అద్భుతాలు సృష్టిస్తున్న ఆదివాసీ రైతాంగం**

**నీటి వనరులు సమకూరుస్తున్న వాసన్**

**అనుబంధ రంగాల నుంచి ఆర్థిక సృష్టి**

**సమస్యల నుంచి గట్టెక్కుతున్న వైనం**

అల్లూరి సీతారామరాజు జిల్లా, దుంబ్రిగుడ మండలం, సొవ్వ క్లస్టరు, కరకవలస గ్రామానికి చెందిన రైతు తాంగుల మొద్దు... తనకు భార్య ఉంది. ఆరెకరాల వరకు భూమి ఉంది. ఎంత భూమి ఉన్నా కనీసం పది, ఇరవై సెంట్లలోనైనా కూరగాయల సాగు చేయడం ఇక్కడ ఆనవాయితీ. సొవ్వ క్లస్టరులో దాదాపుగా ఐదారు సంవత్సరాలుగా ఈ పరిస్థితి ఉంది. ప్రతి ఏటా సేద్యంలో ఇబ్బందులున్నా... ఆశ చావని రైతు మరుసటి సంవత్సరం సాగు





చేయడం ఆనవాయితీ.. క్లస్టరు మొత్తం ఇదే పరిస్థితి ఉండటంతో వాతావరణం అనుకూలిస్తే దిగుబడులు రావడం, లేని పక్షంలో పెట్టుబడులు రాని పరిస్థితి ఉంటోంది.. దీని నుంచి రైతులను గట్టెక్కించేందుకు వాసన్ సంస్థ నీటి వనరుల కల్పనకు శ్రీకారం చుట్టింది. వీటి నుంచి నేరుగా భూములకు నీరందించేందుకు సంస్థ ఆర్థిక సాయంతో అద్దె చెల్లింపు షరతులతో ఇంజన్లు సమకూర్చింది. ఈ విధంగా వచ్చిన రాబడిలో విడతలుగా ఇంజన్ అద్దెను థింసా రైతు ఉత్పత్తిదారుల సంఘానికి జమచేసేలా నిబంధనలు విధించింది. భవిష్యత్తులో ఈ సంఘ నిధులను అవసరాన్ని బట్టి రైతులే వినియోగించుకునేలా చర్యలు తీసుకుంది.

దీనిలో భాగంగా కరకవలసకు చెందిన తాంగుల మొద్దుకు సమీపంలో నీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో మూడు సెంట్ల విస్తీర్ణంలో చెరువు నిర్మాణం చేసేందుకు సంకల్పించింది. దీనిని రైతు, సంస్థ భాగస్వామ్యంతో పనులు చేపట్టేలా నిర్ణయించింది. దీనికి ఖర్చయిన నిధుల్లో 30 శాతం రైతు శ్రమదానం చేసేలా నిర్ణయించి, పనులు పూర్తి చేశారు. దీని నుంచి రైతు భూమికి నీరు పంపింగ్ చేసేందుకు అద్దె ప్రాతిపదికన ఏడాదికి రూ. 8వేల చొప్పున చెల్లించే షరతులతో ఇంజన్ సమకూర్చింది. వీటికి అవసరమైన పైపులను సంస్థ అందించింది. గతంలో ఎన్నడూలేని విధంగా నీటి వనరుల కల్పన జరగడంతో రైతు మొద్దు సాగు ప్రారంభించేందుకు సన్నద్ధమయ్యాడు. తనకున్న 30 సెంట్ల విస్తీర్ణంలో కూరగాయలను సాగు చేసేందుకు నిర్ణయించుకున్నాడు. ముందుగా పశువుల గెత్తాన్ని సాగు చేసే భూమిలో వేసుకుని రూ. 900లతో రెండు దఫాలుగా దుక్కి చేయించాడు. దానిలో కాలిఫ్లవర్, క్యాబేజీ, క్యారెట్, నాగలి దుంప, మొక్కజొన్న, గులిరాగి, బంగాళాదుంపలు, మిరప, వంకాయ, తోటకూర, గోంగూర, కొత్తిమిర, గోరు చిక్కుడు సాగు చేశాడు. వీటి విత్తనాలను రూ. 3,600లు అయ్యింది. కుటుంబ సభ్యుల సహకారంతో స్వంతంగా నాట్లు వేసుకున్నాడు. ఆగష్టులో సాగు చేసిన మొద్దు వర్షాలు లేకపోవడంతో ఇంజన్ సాయంతో వారానికి ఒకసారి నీటి తడులిచ్చేవాడు. నెలరోజులు గడిచాక కలుపు రావడంతో కుటుంబ సభ్యుల సహకారంతో స్వయంగా తొలగించాడు. అదే సమయంలో వంద ఖర్చుతో కిలో బెల్లం, కిలో సెనగపిండి, ఆవు పేడ, మూత్రం, పుట్టమట్టితో కలిసి తయారు చేసుకున్న ద్రవ జీవామృతాన్ని పంటలో పారించాడు. ఇలా తయారు చేసుకున్న ద్రవ జీవామృతాన్ని నెల రోజులకొకసారి పంటకు అందించాడు. ఈ విధంగా పంటకు అన్నీ అనుకూలంగా అందడంతో మంచి దిగుబడులొచ్చాయి. కాలిఫ్లవర్ రూ. 2వేలు, క్యాబేజీ రూ. 15వేలు, క్యారెట్ రూ. 8వేలు, మొక్కజొన్న రూ. 4వేలు, వంకాయలు రూ. 5 వేలు, నాగలిదుంప రూ. 2,500లు, బంగాళా దుంపలు రూ. 2,600లు, గోరుచిక్కుడు రూ. 900లు, కొత్తిమిర రూ. 2,400లు వచ్చింది. మిగిలిన తోటకూర, గోంగూర, రాగులు ఇంటి ఖర్చుల వరకు సరిపోయాయి. ఈ విధంగా పంటకు నాలుగు నెలల పాటు నీటిని అందించేందుకు డీజిల్‌కు 1,800లు ఖర్చయ్యింది. మొత్తం పెట్టుబడి చూస్తే రూ. 6,400లు కాగా, రాబడి రూ. 42,400లు వచ్చింది. పెట్టుబడి పోను నికర ఆదాయం రూ. 36వేలు మిగిలింది. దీనికి తన కుటుంబ సభ్యుల శ్రమ అదనం.

ఈ విధంగా తను సాగు చేసిన నాలుగు నెలల పంట కాలంలో వచ్చిన దిగుబడులను తన ఇంటి ఖర్చుకు సరిపడా తీసుకుని, మిగిలిన వాటిని అమ్మకం చేశాడు. అయినా గతంలో ఎన్నడూలేని విధంగా ఆదాయం సమకూరింది. ఇదేకాకుండా నీటి అవసరాలకు నిర్మాణం చేసుకున్న చెరువును ఖాళీగా వదిలేయకుండా వ్యవసాయ అనుబంధ రంగాన్ని విస్తరించాడు. వాసన్ సంస్థ అందించిన చేప పిల్లలను కొనుగోలు చేసిన రైతు చెరువులో పెంపకం చేపట్టాడు. వీటికి ఘన జీవామృతాన్ని మేతగా వేశాడు. దీంతో పాటు చెరువులో ఉండే నాచు, చిన్న మొక్కలను తింటూ దాదాపుగా రెండు వందల వరకు చేపలు పెరిగి పెద్దవయ్యాయి. వీటిని అవసరమైన సమయాల్లో ఇంటి ఖర్చుకు వినియోగించుకోగా, మిగిలిన వాటిని ఆరు నెలల అనంతరం అమ్మకం చేయగా, రూ. 2వేల వరకు అదనపు ఆదాయం సమకూరింది. దీన్ని బట్టి చూస్తే రైతులకు అన్ని విధాలా వనరులు సమకూరితే అద్భుతాలు చేయొచ్చని రైతు తాంగుల మొద్దు నిరూపించాడు.

వనరుల ఏర్పాటుతో మేలైన ప్రయోజనం జరిగిన విషయాన్ని గుర్తించిన వాసన్ సంస్థ అవసరమైన ప్రాంతాల్లో వీటిని విస్తరించేందుకు ప్రణాళికలు చేస్తోంది. ఇదే క్రమంలో రైతు తాంగుల మొద్దు గతంలో ఎన్నడూలేని విధంగా రాబడి సాధించడంతో, తనను ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది వనరుల కల్పనలో భాగస్వామ్యం, వివిధ పంటల సాగుకు ముందుకొస్తున్నారు.... ఈ విషయాన్ని గుర్తించిన సంస్థ ముందుకొచ్చే రైతులను గుర్తించి, ముగ్గురు, నలుగురుని గ్రూపులుగా చేసి, వనరులను విస్తరించనుంది. ఈ విధానం వల్ల ఏకకాలంలో ఎక్కువ మంది రైతులు లబ్ధిపొందడమే కాకుండా, వారిపై భాగస్వామ్య భారం తగ్గించేందుకు కృషి చేస్తోంది...

❃ ❃ ❃ ❃ ❃